RNI No: TGTEL/25/A2649

VOICE OF PRAJALU

# వాయిస్ ఆఫ్ ప్రజలు

ప్రజల గొంతుక - నిజం కోసం..

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMABAD ADILABAD

హైదరాబాద్ | సోమవారం, ఆగస్టు 17, 2026 | తెలుగు దినపత్రిక | సంపుటి:1 | సంచిక : 107 | పేజీలు: 8 | వెల : రూ.1



**జవాన్ల సంక్షేమానికి**
**కేంద్ర ప్రభుత్వం పెద్దపీట: బండి సంజయ్**
**ఎస్ఎస్‌బీ కుటుంబాలకు 48 క్వార్టర్లు..**
**ఎన్ఎస్‌జీ కమాండోల శిక్షణపై ప్రశంసలు**

# నేడు ఎంసీఆర్ టిమ్స్ ప్రారంభం

**రూ.1,070 కోట్లతో నిర్మాణం..**
**తొలి దశలో 582 పడకలతో వైద్య సేవలు**
**కార్డియాక్, నెఫ్రాలజీ--యూరాలజీ,**
**అవయవ మార్పిడి, ట్రామా సేవలకు ప్రత్యేక కేంద్రం**




హైదరాబాద్, ఆగస్టు 17: నగర ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో సనత్‌నగర్‌లో నిర్మించిన లిమర్రి చెన్నారెడ్డి తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎంసీఆర్ టిమ్స్)లి ఆసుపత్రి నేటి నుంచి ప్రజలకు అందుబాటులోకి రానుంది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి సోమవారం ఈ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని అధికారికంగా ప్రారంభించనున్నారు. ఇందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

### రూ.1,070 కోట్లతో నిర్మాణం

ప్రభుత్వ ఛాతీ ఆసుపత్రి ప్రాంగణంలో లి22.6 ఎకరాల విస్తీర్ణంలో రూ.1,070 కోట్ల వ్యయంతోలి ఎంసీఆర్ టిమ్స్‌ను నిర్మించారు. మొత్తం లి1,082 పడకల సామర్థ్యంతోలి రూపొందించిన ఈ ఆసుపత్రిలో తొలిదశలో 582 పడకలతో వైద్య సేవలు ప్రారంభం కానున్నాయి. మిగిలిన 500 పడకలను ఈ ఏడాది అక్టోబర్ నాటికి అందుబాటులోకి తీసుకురానున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే మే నెల నుంచి ఓపీ విభాగంలో ట్రయల్ రన్ నిర్వహిస్తున్నారు. రోజుకు సుమారు లి200 నుంచి 250 మంది రోగులులి ఓపీ సేవలను వినియోగించుకుంటున్నారు.

### నాలుగు కీలక విభాగాలు

ఎంసీఆర్ టిమ్స్‌లో ప్రధానంగా నాలుగు కీలక వైద్య విభాగాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నారు. కార్డియాక్ – గుండె సంబంధిత వ్యాధులు, నెఫ్రాలజీ–యూరాలజీ – మూత్రపిండాలు, మూత్ర సంబంధిత వ్యాధులు, అవయవ మార్పిడి, ట్రామాకేర్ వీటికి అనుబంధంగా మరో లి37 వైద్య విభాగాలులి పనిచేయనున్నాయి. అత్యవసర వైద్యం, క్లిష్టమైన శస్త్రచికిత్సలు, అవయవ మార్పిడి వంటి అధునాతన సేవలు అందుబాటులోకి రానున్నాయి.

### నిమ్స్ తరహాలో స్వయంప్రతిపత్తి

ఎంసీఆర్ టిమ్స్‌కు నిమ్స్ తరహాలో లిస్వయంప్రతిపత్తి హోదాలి కల్పించారు. దీంతో ఆసుపత్రి తన నిధులను తానే సమకూర్చుకోవాల్సి ఉంటుంది. అయితే ప్రారంభ దశలో ఆసుపత్రి కార్యకలాపాలకు ఇబ్బందులు లేకుండా తొలి ఐదారు సంవత్సరాల పాటు ప్రభుత్వం గ్రాంట్ల రూపంలో ఆర్థిక సహాయం అందించనుంది.

### పలుమార్లు వాయిదా.. ఎట్టకేలకు ప్రారంభం

ఎంసీఆర్ టిమ్స్‌ను గత ఏడాది డిసెంబర్‌లో ప్రారంభించాలని ప్రభుత్వం తొలుత భావించింది. అనంతరం ఉగాది నాటికి ప్రారంభించేందుకు ప్రయత్నించినా నిర్మాణ, మౌలిక వసతుల పనులు పూర్తికాకపోవడంతో ప్రారంభోత్సవం వాయిదా పడుతూ వచ్చింది. తాజాగా అన్ని పనులు పూర్తికావడంతో ఆసుపత్రిని అధికారికంగా ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఎంసీఆర్ టిమ్స్ అందుబాటులోకి రావడంతో హైదరాబాద్ నగరంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు ప్రభుత్వ రంగంలో మరింత మెరుగైన సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి.

# చంద్రగిరి సమీపంలో ఏనుగుల సంచారం

**ప్రజలను అప్రమత్తం చేయండి.. డ్రోన్లతో ఏనుగుల కదలికలపై నిఘా**
**అటవీ, రెవెన్యూ, పోలీసు శాఖలు**
**సమన్వయంతో పనిచేయాలి: ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్**



తిరుపతి: చంద్రగిరి సమీపంలోని ఎర్రవారిపాలెం ప్రాంతంలో ఏనుగుల గుంపు సంచరిస్తున్న నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ--పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ అటవీశాఖ అధికారులను ఆదేశించారు. ఏనుగుల కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సూచించారు. శేషాచలం అటవీ ప్రాంతంలో ఏనుగులు రెండు గుంపులుగా సంచరిస్తూ రాత్రివేళ అటవీ సరిహద్దు గ్రామాల్లోని పంట పొలాలను ధ్వంసం చేస్తున్నట్లు వచ్చిన సమాచారంపై పవన్ కళ్యాణ్ అటవీశాఖ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

### డ్రోన్లతో నిరంతర నిఘా

ఏనుగుల సంచార మార్గాలను గుర్తించేందుకు డ్రోన్లను వినియోగించాలని అధికారులకు సూచించారు. ఏనుగుల కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, సమీప గ్రామాల ప్రజలకు ముందస్తు హెచ్చరికలు జారీ చేయాలని తెలిపారు. అటవీ సమీప గ్రామాల్లో రాత్రివేళ ప్రత్యేక గస్తీని పెంచాలని, సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రజలు రాత్రి వేళ పొలాలకు వెళ్లకుండా అవగాహన కల్పించాలని ఆదేశించారు. గ్రామాల్లో మైకులు, మొబైల్ సందేశాలు, స్థానిక సమాచార వ్యవస్థల ద్వారా ప్రజలకు హెచ్చరికలు అందించాలని సూచించారు.

### హనుమాన్ బృందాల మోహరింపు

అవసరమైన ప్రాంతాల్లో లిఎ.నూ.చీ.ఖ.వీ.నూ.చీ. బృందాలనులి మోహరించి ప్రజల భద్రతకు చర్యలు తీసుకోవాలని పవన్ కళ్యాణ్ ఆదేశించారు. క్షేత్రస్థాయి అటవీ సిబ్బంది 24 గంటలు అప్రమత్తంగా ఉండేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. అటవీ, రెవెన్యూ, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేసి ఏనుగుల సంచారంపై ప్రజలకు తక్షణ సమాచారం అందించాలని సూచించారు.

### పంట నష్టానికి పరిహారం

ఏనుగులు పంట పొలాల్లోకి ప్రవేశించి పంటలను ధ్వంసం చేస్తున్న నేపథ్యంలో, పంట నష్టంపై అధికారులు నివేదికలు రూపొందించిన వెంటనే అటవీశాఖ ద్వారా లితక్షణ పరిహారం అందించేలా చర్యలు తీసుకుంటామనిలి పవన్ కళ్యాణ్ తెలిపారు. ఏనుగులను రెచ్చగొట్టే చర్యలకు పాల్పడకుండా, వాటి సంచారానికి దూరంగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అటవీశాఖ అధికారులు ఇచ్చే సూచనలను తప్పనిసరిగా పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని కోరారు.



# వరంగల్ గడ్డ పోరాట స్ఫూర్తికి ప్రతీక.. ప్రజా సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

**ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటాం.. ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు**

**రూ.484 కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు**

**వరంగల్ అభివృద్ధికి భారీ ప్రణాళికలు.. మామునూరు విమానాశ్రయం, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీకి ప్రాధాన్యం**

**పరకాల పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**





హనుమకొండ జిల్లా, ఆగస్టు 16(వాయిస్ టుడే): వరంగల్ గడ్డకు గొప్ప చరిత్ర, పోరాట స్ఫూర్తి, ప్రజా చైతన్యం ఉన్నాయని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడిన మహనీయులు, తమ జీవితాలను ప్రజల కోసం త్యాగం చేసిన ఎందరో ఉద్యమకారులు ఈ ప్రాంతం నుంచి వచ్చారని గుర్తు చేశారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే, పోరాడే చైతన్యం వరంగల్ ప్రజల సొంతమని అన్నారు. హనుమకొండ జిల్లా పరకాల మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన 'ప్రజాపాలన--ప్రగతి బాట విజయోత్సవ సభ' కు ముఖ్యమంత్రి హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా సుమారు రూ.484 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ముఖ్యమంత్రి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. కాకతీయుల ఘన చరిత్ర, వారి నిర్మాణాలు, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి, ప్రజా పోరాటాలకు వరంగల్ ప్రాంతం నిదర్శనంగా నిలిచిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్, దాశరథి వంటి మహనీయులు ప్రజల కోసం తమ జీవితాలను అంకితం చేశారని గుర్తు చేశారు. ప్రజల నుంచి ఎన్నికైన ప్రజాప్రతినిధులు ప్రజలకు సేవకులుగా పనిచేయాలే తప్ప ప్రజలపై ఆధిపత్యం చెలాయించే భావన ఉండకూడదని సీఎం స్పష్టం చేశారు. ప్రజల చైతన్యమే ప్రజాస్వామ్యానికి బలమని అన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రంపై భారీగా అప్పుల భారాన్ని మిగిల్చినప్పటికీ ప్రజా ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని ఏకకాలంలో ముందుకు తీసుకెళ్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను క్రమబద్ధీకరిస్తూనే రైతులు, మహిళలు, నిరుపేదలు, యువత, అణగారిన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా అమలు చేస్తూ ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటామని స్పష్టం చేశారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి గడపకు సంక్షేమ పథకాల ప్రయోజనాలు చేరేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని సీఎం అన్నారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఉచిత విద్యుత్ తదితర సంక్షేమ పథకాల ద్వారా అండగా నిలుస్తున్నామని తెలిపారు. పేదల జీవితాల్లో ఆర్థిక, సామాజిక భద్రత కల్పించడమే ప్రజాపాలన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

**రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వానికి అత్యంత ముఖ్యం**

రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వానికి అత్యంత ముఖ్యమైన అంశమని సీఎం అన్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, ఉచిత విద్యుత్, ధాన్యం కొనుగోళ్లు, వరి పంటకు బోనస్ వంటి కార్యక్రమాల ద్వారా రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. వ్యవసాయాన్ని దండగ నుంచి పండుగగా మార్చి రైతును రాజుగా చేయాలన్నదే ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. రైతు పండించిన ప్రతి ధాన్యపు గింజకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన, సాధికారతకు ప్రజా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని సీఎం తెలిపారు. స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయడంతో పాటు మహిళలకు ఉపాధి, ఆదాయ అవకాశాలు పెంచేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. మహిళలు స్వయంగా వ్యాపారాలు నిర్వహించేందుకు పెట్రోల్ బంకులు, ఇతర ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని 8 వేల గ్రామాల్లో ఇందిరమ్మ మహిళా శక్తి భవనాల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. నిరుద్యోగ యువత ఆకాంక్షలను నెరవేర్చేందుకు ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని సీఎం అన్నారు. వివిధ శాఖల్లో ఉద్యోగ నియామక ప్రక్రియను వేగవంతం చేశామని, మిగిలిన ఖాళీలను కూడా దశలవారీగా భర్తీ చేస్తామని తెలిపారు. యువత ఎలాంటి అపోహలకు లోనుకాకుండా పోటీ పరీక్షలకు సమర్థంగా సిద్ధం కావాలని సూచించారు. ఇందిరమ్మ రాజ్యంలో అన్ని వర్గాలకు సముచిత ప్రాధాన్యం కల్పిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీలు, మహిళలు, పేదలు, అణగారిన వర్గాలకు రాజకీయ, సామాజిక, ఆర్థిక అవకాశాలు కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్నారు. కుటుంబ ప్రయోజనాలకు కాకుండా సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇస్తూ పాలన కొనసాగిస్తున్నామని చెప్పారు.

**వరంగల్ అభివృద్ధికి భారీ ప్రణాళికలు..**

వరంగల్ నగర సమగ్ర అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని సీఎం తెలిపారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, ఔటర్ రింగ్ రోడ్డు, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ వంటి కీలక అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళుతున్నామని అన్నారు. వరంగల్ ప్రాంతంలో మౌలిక వసతులను మరింత బలోపేతం చేసి పరిశ్రమలు, ఉపాధి అవకాశాలను పెంచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

**పేదల సంక్షేమంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి సమాన ప్రాధాన్యం..**

అనంతరం రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పేదల సంక్షేమంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇస్తోందన్నారు. పరకాలలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా రూ.400 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయడం ప్రభుత్వ అభివృద్ధి సంకల్పానికి నిదర్శనమన్నారు. దశాబ్దాలుగా వరంగల్ ప్రజలు కోరుకుంటున్న మామునూరు విమానాశ్రయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో సాకారం చేస్తున్నామని మంత్రి తెలిపారు. భూసేకరణ కోసం రూ.300 కోట్లకు పైగా ఖర్చు చేసి చర్యలు చేపట్టామని, రాబోయే రెండేళ్లలో మామునూరు విమానాశ్రయాన్ని పూర్తి చేసి విమాన సర్వీసులు ప్రారంభించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. వరంగల్ నగర భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని సుమారు రూ.5,700 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయనున్నామని మంత్రి చెప్పారు. హైదరాబాద్‌కు దీటుగా వరంగల్‌ను ఆధునిక మౌలిక వసతులతో అభివృద్ధి చేయాలన్నదే ముఖ్యమంత్రి లక్ష్యమన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా రైతాంగానికి కీలకమైన దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేయాలని సీఎం స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని మంత్రి తెలిపారు. రూ.6 వేల కోట్లకు పైగా వ్యయంతో కొనసాగుతున్న దేవాదుల ప్రాజెక్టును ప్రజా ప్రభుత్వ హయాంలో పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో భారీగా అప్పులు చేసినప్పటికీ పేదల కోసం తగిన సంఖ్యలో ఇళ్లు నిర్మించలేదని మంత్రి అన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హైదరాబాద్‌తో కలిపి రెండు విడతల్లో 8 లక్షల ఇళ్లు మంజూరు చేసి, ఇప్పటికే 2 లక్షలకు పైగా ఇళ్లను పూర్తి చేశామని తెలిపారు. మిగిలిన ఇళ్లను కూడా వేగంగా పూర్తి చేసి పేదల ఆత్మగౌరవాన్ని నిలబెడతామని చెప్పారు. తెలంగాణ ఉద్యమానికి వరంగల్ గడ్డ ప్రధాన కేంద్రంగా నిలిచిందని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తికి ప్రతీకగా నిలిచిన ప్రొఫెసర్ జయశంకర్ గ్రామాన్ని రెవెన్యూ గ్రామంగా ఏర్పాటు చేశామని, ఆ గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు.

**పరకాల అభివృద్ధికి సీఎం ప్రత్యేక సహకారం..**

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ పరకాల ప్రాంతానికి గొప్ప చరిత్ర, పోరాట స్ఫూర్తి ఉందన్నారు. స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో భూమి, భుక్తి కోసం పరకాల ప్రాంత ప్రజలు చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని తెలిపారు. 1947 సెప్టెంబర్ 2న స్వాతంత్ర్య ఉద్యమకారులపై జరిగిన దాడిలో 25 మంది స్వాతంత్ర్య సమరయోధులు అమరులయ్యారని, వారి త్యాగాలను పరకాల ప్రజలు ఎన్నటికీ మరువలేరని పేర్కొన్నారు. 2003లో నిర్మించిన పరకాల అమరధామాన్ని మరింత అభివృద్ధి చేసి, పర్యాటక ప్యాకేజీలో భాగంగా చేర్చి ప్రత్యేక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. పరకాల ప్రాంతానికి సుమారు రూ.200 కోట్లతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యా, వైద్య రంగాలకు సీఎం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారని పేర్కొన్నారు. పరకాలలో 100 పడకల ఆసుపత్రి పనులు గతంలో ఆశించిన స్థాయిలో ముందుకు సాగలేదని, రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా సీఎం స్పందించి రూ.11.60 కోట్లు విడుదల చేయడంతో పనులు తిరిగి ప్రారంభమయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు. నేడు అదే 100 పడకల ఆసుపత్రి పనులను పూర్తి చేసి ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించుకోవడం పరకాల ప్రజలకు గర్వకారణమన్నారు. మహిళల ఆర్థిక సాధికారతకు సీఎం రేవంత్‌రెడ్డి ఇస్తున్న ప్రాధాన్యానికి అనుగుణంగా పరకాల నియోజకవర్గంలో హింద్రా డెయిరీ ఏర్పాటు ఆలోచనను 2024 డిసెంబర్ నుంచే ముందుకు తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రస్తుతం సుమారు 2 వేల మంది సభ్యులతో ప్రారంభమవుతున్న ఈ కార్యక్రమాన్ని రాబోయే రోజుల్లో విస్తరించి 40 వేల కుటుంబాలకు ప్రయోజనం చేకూర్చేలా కృషి చేస్తానని చెప్పారు. పరకాల సమగ్ర అభివృద్ధికి నిరంతరం సహకరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

**ఒక్కో సమస్యకు పరిష్కారం చూపుతూ ముందుకు..**

ప్రజాపాలనలో ఒక్కో సమస్యను గుర్తిస్తూ, ఒక్కో సమస్యకు పరిష్కారం చూపుతూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజల సహకారం, ఆశీర్వాదంతో మరింత వేగంగా అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి అనసూయ సీతక్క, రాష్ట్ర సాంఘిక, గిరిజన, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ విప్ రామచంద్రు నాయక్, టిపిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, ఎమ్మెల్యేలు దొంతి మాధవరెడ్డి, యశస్విని రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, కెఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ రావు, డాక్టర్ మురళి నాయక్, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రూ పాషా, రాష్ట్ర తెలుగు అకాడమీ చైర్మన్ కురపాటి వెంకయనారాయన, పరకాల ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి ఎన్. శ్రీధర్, కళాశాల, టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ దేవసేన, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు చాహత్ బాజ్ పాయి, డాక్టర్ సత్య శారద,మున్సిపల్ చైర్మన్ సునీల్ కుమార్, అదనపు కలెక్టర్ రవి, ఆర్డీవోలు డిఎస్ వెంకన్న, వెంకటేష్, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు, పరకాల నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.



**జవాన్ల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం పెద్దపీట: బండి సంజయ్**

**ఎస్ఎస్‌బీ కుటుంబాలకు 48 క్వార్టర్లు.. ఎన్ఎస్‌జీ కమాండోల శిక్షణపై ప్రశంసలు**

హైదరాబాద్/ఇబ్రహీంపట్నం: దేశ భద్రతలో కీలకంగా పనిచేస్తున్న కేంద్ర సాయుధ బలగాల సిబ్బంది సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. జవాన్ల కుటుంబాలకు మెరుగైన వసతి, విద్య, వైద్యం వంటి సదుపాయాలు కల్పించడంతో పాటు భద్రతా బలగాలను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మరింత బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో సశస్త్ర సీమా బల్ (ఎస్ఎస్‌బీ) సిబ్బంది కోసం నిర్మించిన 48 నూతన కుటుంబ క్వార్టర్లను బండి సంజయ్ ప్రారంభించారు. దేశ సరిహద్దుల్లో అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో విధులు నిర్వహిస్తూ మాదకద్రవ్యాల అక్రమ రవాణా, ఆయుధాల స్మగ్లింగ్, మానవ అక్రమ రవాణా, అక్రమ వలసలు, నకిలీ కరెన్సీ, వ్యవస్థీకృత నేరాలను అరికట్టడంలో ఎస్ఎస్‌బీ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. ఈ క్వార్టర్లు కేవలం నివాస గృహాలు మాత్రమే కాదని, జవాన్లు మరియు వారి కుటుంబాల సంక్షేమం, గౌరవానికి కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతకు ప్రతీకలని అన్నారు. "జవాన్ కుటుంబానికి సురక్షితమైన నివాసం, నాణ్యమైన విద్య, వైద్యం అందుబాటులో ఉన్నాయని నమ్మకంతో ఉంటే.. దేశ సేవపై మరింత ధైర్యం, ఏకాగ్రతతో పనిచేయగలడు" అని బండి సంజయ్ పేర్కొన్నారు. సరిహద్దు భద్రతను మరింత పటిష్టం చేసేందుకు ఎస్ఎస్‌బీ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తోందని తెలిపారు. డ్రోన్లు, సీసీటీవీ నిఘా, థర్మల్ ఇమేజర్లు, నైట్ విజన్ పరికరాలు, జీపీఎస్ ఆధారిత పెట్రోలింగ్, సురక్షిత డిజిటల్ కమ్యూనికేషన్, జీఐఎస్ ఆధారిత ప్రణాళిక వంటి సాంకేతికతలను వినియోగిస్తున్నట్లు వివరించారు.

# సీఎం పర్యటనలో కాంగ్రెస్ 'గుబులు'!

**సురేఖ గైర్హాజరు.. ఇనగాల గైర్హాజరుపై చర్చ**

**పరకాలలో రేవూరి--ఇనగాల సమీకరణాలపై ఆసక్తి**

**సీఎం, పీసీసీ చీఫ్ సమక్షంలోనే రాజకీయ చర్చలు**





హనుమకొండ జిల్లా, ఆగస్టు 16 (వాయిస్ టుడే): ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఉమ్మడి వరంగల్ జిల్లాలో చేపట్టిన మేడారం--పరకాల పర్యటన కాంగ్రెస్ పార్టీలో కొత్త రాజకీయ చర్చకు తెరలేపింది. మేడారంలో సమ్మక్క--సారలమ్మ వనదేవతలను దర్శించుకున్న సీఎం.. అనంతరం పరకాలలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. అభివృద్ధి కార్యక్రమాలే ప్రధాన అజెండాగా సాగిన ఈ పర్యటన.. కొందరు కీలక నేతల గైర్హాజరు, ఆహ్వానాలపై నెలకొన్న అనుమానాలతో కాంగ్రెస్ అంతర్గత రాజకీయాలపైనా చర్చకు దారితీసింది.

**సురేఖ గైర్హాజరు.. కారణమేంటి?**

మేడారం పర్యటనలో దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ గైర్హాజరు కావడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. దేవాదాయశాఖకు అత్యంత కీలకమైన మేడారం కార్యక్రమానికి సంబంధిత శాఖ మంత్రి హాజరు కాకపోవడంపై పార్టీ శ్రేణుల్లో ప్రశ్నలు తలెత్తాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో మంత్రి సురేఖకు సఖ్యత విషయంలో ఏమైనా విభేదాలు ఉన్నాయా? అనే చర్చ కూడా వినిపిస్తోంది. అయితే ఈ అంశంపై ఇరువురు నేతల నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

**ఇనగాల గైర్హాజరుపై చర్చ**

హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి సీఎం పర్యటనలో కనిపించకపోవడం కూడా పరకాల నియోజకవర్గంలో చర్చకు దారితీసింది. సీఎం పర్యటనకు సంబంధించి ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి నుంచి ఇనగాలకు ఆహ్వానం అందలేదన్న ప్రచారం పార్టీ వర్గాల్లో వినిపించింది. అయితే దీనిపై అధికారిక ధ్రువీకరణ లేదు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా పార్టీ వ్యవహారాల్లో కీలకంగా ఉన్న ఇనగాల పర్యటనకు దూరంగా ఉండటానికి కారణం ఏమిటన్నదానిపై కార్యకర్తలు, నాయకులు ఆరా తీస్తున్నారు. ఇది ప్రోటోకాల్‌కు సంబంధించిన అంశమా? లేక స్థానిక రాజకీయ సమీకరణాల ప్రభావమా? అన్న చర్చ కొనసాగుతోంది.

**ఇనగాల ఫాలోయింగ్‌పై ఆసక్తి**

పరకాల నియోజకవర్గంలో ఇనగాల వెంకట్రామ్‌రెడ్డికి ఉన్న అభిమానులు, కార్యకర్తల బలం, ప్రజల్లో ఆయనకు ఉన్న ఆదరణపై కూడా రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇనగాల రాజకీయంగా బలపడుతున్నారన్న ప్రచారం నేపథ్యంలో.. ఆయన భవిష్యత్ రాజకీయ ప్రాధాన్యతపై ఆసక్తి నెలకొంది. ఈ పరిణామాలు పరకాల నియోజకవర్గ రాజకీయ సమీకరణాలపై ఎలాంటి ప్రభావం చూపుతాయన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇనగాల ఫాలోయింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి వర్గానికి ఇబ్బందిగా మారుతోందన్న ప్రచారం కూడా స్థానికంగా వినిపిస్తోంది. అయితే దీనిపై ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి నుంచి ఎలాంటి అధికారిక స్పందన లేదు. ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి కూడా బహిరంగంగా స్పందించలేదు.

**సీఎం, పీసీసీ చీఫ్ సమక్షంలోనే..**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు బి. మహేష్‌కుమార్‌గౌడ్ సమక్షంలో జరిగిన కార్యక్రమంలోనే కాంగ్రెస్ నేతల మధ్య సమన్వయం, రాజకీయ ప్రాధాన్యత, స్థానిక ఆధిపత్యంపై చర్చ జరగడం ఆసక్తికరంగా మారింది. ఒకవైపు సీఎం భారీ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతుండగా.. మరోవైపు స్థానిక కాంగ్రెస్‌లో నాయకుల మధ్య రాజకీయ సమీకరణాలపై చర్చ సాగడం పార్టీ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.

**అభివృద్ధి పర్యటనకు రాజకీయ రంగు**

ముఖ్యమంత్రి పర్యటన ప్రధానంగా అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల కోసమే జరిగినప్పటికీ.. నేతల హాజరు, గైర్హాజరు కారణంగా రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. మేడారం నుంచి పరకాల వరకు సీఎం పర్యటనలో ఎవరు కనిపించారు? ఎవరు కనిపించలేదు? ఎవరికి ప్రాధాన్యత లభించింది? అనే అంశాలపై ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

**ముందు ముందు ఏం జరుగుతుంది?**

పరకాల నియోజకవర్గంలో కాంగ్రెస్ బలోపేతానికి పలువురు నాయకులు, కార్యకర్తలు పనిచేస్తున్న నేపథ్యంలో.. నాయకుల మధ్య సమన్వయం కొనసాగుతుందా? లేక రాజకీయ విభేదాలు మరింత ముదురుతాయా? అన్నది ఆసక్తికరంగా మారింది. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి పాత్ర, ఎమ్మెల్యేగా రేవూరి ప్రకాశ్‌రెడ్డి రాజకీయ ప్రాధాన్యత, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యవహారశైలి.. రాబోయే రోజుల్లో పరకాల కాంగ్రెస్ రాజకీయాలపై ప్రభావం చూపే అంశాలుగా మారే అవకాశం ఉంది. మొత్తంగా సీఎం రేవంత్‌రెడ్డి మేడారం--పరకాల పర్యటన అభివృద్ధి కార్యక్రమాలకు వేదిక కావాల్సి ఉండగా.. కాంగ్రెస్ అంతర్గత రాజకీయాలు, నాయకుల మధ్య సమన్వయం, ఆహ్వానాల వ్యవహారం, స్థానిక రాజకీయ సమీకరణాలపై కొత్త చర్చకు తెరలేపింది. అయితే ప్రస్తుతానికి ఇవన్నీ రాజకీయ వర్గాల్లో జరుగుతున్న చర్చలు, ప్రచారాలే. సంబంధిత నేతల నుంచి అధికారికంగా స్పష్టత రావాల్సి ఉంది. రానున్న రోజుల్లో ఈ పరిణామాలు ఏ మలుపు తిరుగుతాయన్నది ఆసక్తికరంగా మారింది.

# రైతు నుంచి కుటుంబానికి నాణ్యమైన కూరగాయలు

## ఏరువాక ఫార్మ్స్ పోస్టర్ ఆవిష్కరణలో జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుంద్ర కుమారస్వామి




హైదరాబాద్, ఆగస్టు 16: రైతుల నుంచి నేరుగా నాణ్యమైన కూరగాయలు, పండ్లను సేకరించి ప్రతి కుటుంబానికి తాజా, పరిశుభ్రమైన ఆహారాన్ని అందించాలనే లక్ష్యంతో ఏర్పాటైన ఏరువాక ఫార్మ్స్ పోస్టర్‌ను పెద్దమ్మ అమ్మవారి ఆలయ సమీపంలో ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు, ప్రముఖ సామాజికవేత్త దుంద్ర కుమారస్వామి ముఖ్యఅతిథిగా హాజరై పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా దుంద్ర కుమారస్వామి మాట్లాడుతూ, "ఆరోగ్యమే మహాభాగ్యం. ప్రతి కుటుంబం తీసుకునే ఆహారం నాణ్యమైనది, తాజాది, పరిశుభ్రమైనదిగా ఉండాలి. పొలం నుంచి నేరుగా కమ్యూనిటీ కుటుంబాలకు తాజా కూరగాయలు, పండ్లను అందించాలనే సంకల్పంతో ఏరువాక ఫార్మ్స్ ఏర్పాటు కావడం అభినందనీయమని" అన్నారు. స్థానిక రైతుల నుంచి నాణ్యమైన ఉత్పత్తులను నేరుగా సేకరించి వినియోగదారులకు అందించడం ద్వారా రైతు--వినియోగదారుల మధ్య దూరాన్ని తగ్గించవచ్చని పేర్కొన్నారు. "రైతుకు న్యాయమైన ధర--వినియోగదారుడికి నాణ్యమైన ఉత్పత్తి" అనే సూత్రం ఏరువాక ఫార్మ్స్‌కు ప్రధాన బలంగా ఉండాలని సూచించారు. ఇతరుల కంటే తక్కువ ధరకు విక్రయించడం ఒక్కటే లక్ష్యం కాకూడదని, నాణ్యత, తాజాదనం, పరిశుభ్రత, పారదర్శకత విషయంలో ప్రత్యేకతను చాటుకోవాలని దుంద్ర కుమారస్వామి అన్నారు. రైతు బలపడితే వ్యవసాయం బలపడుతుందని, వ్యవసాయం బలపడితే దేశ ఆహార భద్రత మరింత పటిష్టమవుతుందని పేర్కొన్నారు.

ఏరువాక ఫార్మ్స్ లోగో రైతు ఆత్మగౌరవానికి, స్వచ్ఛమైన ఆహారానికి భరోసాకు, వినియోగదారుల నమ్మకానికి ప్రతీకగా నిలవాలని ఆకాంక్షించారు. రైతుల నుంచి నేరుగా సేకరించిన సీజనల్ పండ్లు, కూరగాయలను పరిశుభ్రమైన విధానంలో కుటుంబాలకు అందించడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించవచ్చన్నారు. "పొలం నుంచి కుటుంబానికి... రైతు కష్టం నుంచి ఆరోగ్యకరమైన ఆహారం వరకు---ఇదే ఏరువాక ఫార్మ్స్ లక్ష్యం" అని దుంద్ర కుమారస్వామి పేర్కొన్నారు. కార్యక్రమంలో జాతీయ బీసీ దళ్ దక్షిణ రాష్ట్రాల అధ్యక్షుడు కుర్మారావు, జాతీయ బీసీ దళ్ సంగారెడ్డి అధ్యక్షుడు రక్షణ, ఏరువాక ఫార్మ్స్ పర్యవేక్షణ, భాగస్వామి ఏడుకొండలు, పద్మ తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ శ్రీ భౌరంపేట్ బంగారమ్మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్సీ శంభిపూర్ రాజు

కుత్బుల్లాపూర్ ఆగష్టు 16(వాయిస్ టుడే ): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ సర్కిల్ పరిధిలోని భౌరంపేట్ లో శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ( బౌరమ్మగుడి ) ఆలయ వార్షికోత్సవం మరియు శ్రీ శ్రీ భౌరంపేట్ బంగారు మైసమ్మ తల్లి బోనాల ఉత్సవాల సందర్భంగా మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు రెండు ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ వార్షికోత్సవం సందర్భంగా శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ భౌరంపేట్ బంగారు మైసమ్మ ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలందరు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, గ్రామంలో శాంతి, సౌభాగ్యం, అభివృద్ధి వెల్లివిరియాలని స్వామివారిని, అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమాల్లో ఉమ్మడి మెదక్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు జిన్నారం వెంకటేష్ గౌడ్ , మేడ్చల్ జిల్లా గ్రంధాలయం సంస్థ మాజీ చైర్మన్ నాగరాజు యాదవ్ , మేడ్చల్ జిల్లా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పోలీస్ గోవింద్ రెడ్డి , భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి ,బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నాచారం మురళీ యాదవ్ , ఆలయ కమిటీ అధ్యక్షులు ఎం . యాదిరెడ్డి మరియు తాజా మాజీ ప్రజాప్రతినిధులు, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, భక్తులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో రూ.1.16 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



కుత్బుల్లాపూర్ ఆగష్టు 16(వాయిస్ టుడే ): కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా గాజులరామారం మరియు మహదేవపురం డివిజన్లలో రూ. 1.16 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ శంకుస్థాపన చేశారు.గాజులరామారం డివిజన్ పరిధిలో శ్రీరామ్ నగర్ లో రూ. 26.50 లక్షలతో మంజూరైన అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు, మహాదేవపురం డివిజన్ పరిధిలోని యండమూరి లేఅవుట్‌లో రూ. 60 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి, శివపురం కాలనీలో రూ. 30 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం అభినందనీయమని అన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం అభివృద్ధిలో పూర్తిగా వెనుకబడిపోయిందని ఆయన విమర్శించారు. ప్రజల అవసరాలను తీర్చడంలో అప్పటి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు, త్వరలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన శంకుస్థాపన కార్యక్రమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్ , సిహెచ్ బుచ్చిరెడ్డి, యాము సాగర్, దంపనబోయిన శ్రీనివాస్, కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు, సభ్యులు శ్రీనివాసరెడ్డి, దివాకర్, వెంకటేశ్వర్ రెడ్డి, సుమన్ రెడ్డి, శ్రీధర్, తిరుపతి రెడ్డి, నాగరాజు, ప్రసాద్ రెడ్డి, మహేష్, రాజేష్ గౌడ్, ఏకాంబరం, సుమన్, ధనరాజ్, చంద్రశేఖర్ మరియు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## నాచారం ఎర్రకుంటలో ఘనంగా బోనాల ఉత్సవాలు

నాచారం (వాయిస్ టుడే): ఎర్రకుంటలోని శ్రీ శ్రీ మాతా నల్ల పోచమ్మ దేవాలయంలో బోనాల ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడపడుచులు బోనమెత్తుకొని అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దేశాపాక నర్సింగ్‌రావు, దేశాపాక బిక్షపతి, జంగం అశోక్, వాసుదేవరావు, కొమ్మట ఆశన్న, శ్రీమూర్తి నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.



## చెంగిచెర్లలో ఘనంగా పోచమ్మ బోనాలు

నాచారం (వాయిస్ టుడే): శ్రీ పోచమ్మ దేవాలయంలో ఆదివారం బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలు ఎత్తుకుని అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత 50 ఏళ్లుగా ప్రతి ఏడాది పోచమ్మ బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ పరిసరాల్లో భక్తులతో సందడి నెలకొంది.



## రహేజా విస్తాస్ అపార్ట్మెంట్‌లో ఘనంగా బోనాల పండుగ

నాచారం (వాయిస్ టుడే): నాచారం రహేజా విస్తాస్ అపార్ట్మెంట్‌లో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర నాయకులు, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో రహేజా విస్తాస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మంతెన శ్రీనివాస్, మహిళా సభ్యురాలు గిరిజ నాయుడు, మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్, శ్రీనివాస్ శర్మ, పుప్పాల వెంకటేష్, గందమల గోపి, అజయ్ కుమార్ తదితర అసోసియేషన్ సభ్యులు, కార్యక్రమ నిర్వాహకులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## సీతాఫల్మండి రవీంద్రనగర్‌లో ఘనంగా బోనాల పండుగ

### ముఖ్యఅతిథిగా గండికోట కుమార్

నాచారం (వాయిస్ టుడే):సీతాఫల్మండి డివిజన్ పరిధిలోని రవీంద్రనగర్‌లో బోనాల పండుగ సందర్భంగా పోచమ్మ తల్లి దేవాలయంలో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సికింద్రాబాద్ డీసీసీ ప్రధాన కార్యదర్శి, వడ్డే ఓబన్న ఉత్సవ కమిటీ సభ్యుడు గండికోట కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గండికోట కుమార్ పోచమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ వేడుకల్లో స్థానికులు, భక్తులు పాల్గొన్నారు.



## వివిధ శుభ కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

### వివాహ వార్షికోత్సవ వేడుకల్లో దంపతులకు శుభాకాంక్షలు..

### పలు వివాహ వేడుకల్లో నూతన వధూవరులకు ఆశీర్వాదం

కుత్బుల్లాపూర్ ఆగష్టు 16(వాయిస్ టుడే ): వివిధ శుభ కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు బీఆర్ఎస్ సూరారం 129 డివిజన్ ప్రెసిడెంట్ పుప్పల భాస్కర్ - వాణి సిల్వర్ జూబ్లీ(25వ వివాహ వార్షికోత్సవ) మరియు వారి తండ్రి పుప్పాల నర్సింగ్ రావు వసంత గారి గోల్డెన్ జూబ్లీ (50వ వివాహ వార్షికోత్సవ) సందర్భంగా పేట్ బషీరాబాద్ దండమూడి ఎన్క్లవ్ లో వారి నివాసంకు వెళ్లి పూలే బొకే ఇచి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు నిరంతరం ఆనందంగా, ఆరోగ్యంగా మరియు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.మేడ్చల్ మునిరాబాద్ లోని ఒన్వా కన్వెన్షన్ హాల్ లో దుండిగల్ తండా నివాసులు బీఆర్ఎస్ పార్టీ నాయకులు జగన్ నాయక్ కుమార్తె వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.దుండిగల్ లోని గణపతి సచ్చిదానంద స్వామీజీ ఆశ్రమంలో బాచుపల్లి నివాసులు లేట్ నారాముల్ల రాములు కుమార్తె వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.గుమ్మడిదలలోని ఎంపీఆర్ఆర్ గార్డెన్స్ లో గడ్డపోతారం వావిలాల్ నివాసులు కుమ్మరి కృష్ణ కుమార్తె వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో తాజా మాజీ కౌన్సిలర్లు, నాయకులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కుత్బుల్లాపూర్ ఆగష్టు 16(పవాయిస్ టుడే ): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 279వ డివిజన్ సుభాష్ చంద్రబోస్ నగర్--బి రోడ్డు, మేస్త్రీ నగర్ ప్రాంతాల్లో 8, 9, 10, 11, 12వ వీధుల్లో రోడ్ల దుస్థితి కారణంగా ప్రజల రాకపోకలకు, చిన్నారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్న విషయాన్ని స్థానికులు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల సమస్యపై వెంటనే స్పందించిన ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో, సిఎంసీ నిధుల ద్వారా రూ. 60 లక్షల వ్యయంతో రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి సమక్షంలో, వారి చేతుల మీదుగా ఈ అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సిద్ధనోళ్ల సంజీవ్ రెడ్డి, డీసీసీ సెక్రటరీ లాయక్, అజయ్, జమీర్ రహీమ్, కలీమ్, గఫార్, ఖాజా రెహ్మాన్ ఖహీల్, ఎం.డి. ఖలీల్ ఉర్ రెహ్మాన్, హనీఫ్, నవీన్ గౌడ్, యాదగిరి, బుచ్చి రెడ్డి, అంజనేయులు, నరసింహాచారి, విశ్వనాథ్, ప్రభాకర్, అజాజ్, శ్రావణ్, విష్ణువర్ధన్ గౌడ్, కృష్ణ గౌడ్, ప్రభు గౌడ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.ప్రజల మౌలిక వసతుల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోంది.

VOICE OF PRAJALU వాయిస్ ఆఫ్ ప్రజలు
ప్రజల గొంతుక - నిజం కోసం.. తెలుగు దినపత్రిక
హైదరాబాద్
సోమవారం 17 ఆగస్టు 2026



## గాంధీభవన్‌లో పిపిసి సమావేశం

## ఎస్ఐఆర్-2పై కాంగ్రెస్ నేతలతో మీనాక్షి నటరాజన్ చర్చ

కూకట్ పల్లి : ఆగష్టు16(వాయిస్ టుడే): గాంధీభవన్‌లో ఆదివారం జరిగిన కాంగ్రెస్ పార్టీ పిపిసి సమావేశంలో ఏఐసీసీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌తో మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వజ్రేష్ యాదవ్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గత 45 రోజులుగా కొనసాగిన తొలి దశ ఎస్ఐఆర్ కార్యక్రమంపై చర్చించారు. ఎస్ఐఆర్ లో బీఎల్ఏలు, డివిజన్ అధ్యక్షులు, బ్లాక్ అధ్యక్షులు సమర్థవంతంగా పనిచేశారని, ఇంటింటికీ వెళ్లి ప్రతి ఓటరును కలిసే అవకాశం లభించిందని బండి రమేష్ వివరించారు. అలాగే గత పిపిసి సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలు, కార్యాచరణ పురోగతి, డివిజన్ కమిటీల నియామకం, స్థానిక రాజకీయ పరిస్థితులు, ప్రభుత్వ పనితీరుపై ప్రజల అభిప్రాయాలను మీనాక్షి నటరాజన్ అడిగి తెలుసుకున్నారు. తొలి దశ ఎస్ఐఆర్ విజయవంతంగా పూర్తయిందని పేర్కొన్న ఆమె, త్వరలో ప్రారంభం కానున్న ఎస్ఐఆర్ -2 కార్యక్రమంలో మరింత అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. తొలి దశ మాదిరిగానే రెండో దశ కార్యక్రమాన్ని కూడా సమన్వయంతో, దృఢ సంకల్పంతో విజయవంతం చేయాలని కాంగ్రెస్ నాయకులకు పిలుపునిచ్చారు.



## వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా ఘన నివాళులర్పించిన కంచి మహేందర్

కూకట్ పల్లి : ఆగష్టు 16(వాయిస్ టుడే): భారతరత్న, మాజీ ప్రధానమంత్రి, దివంగత అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకులు కాంచి మహేందర్ ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వాజ్‌పేయి విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కాంచి మహేందర్ మాట్లాడుతూ.. భారత రాజకీయాల్లో విలువలు, సిద్ధాంతాలు, నిబద్ధతకు వాజ్‌పేయి ప్రతీకగా నిలిచారని అన్నారు. దేశ సేవనే పరమావధిగా భావించి, దేశ అభ్యున్నతికి తన జీవితాన్ని అంకితం చేసిన మహానేత అని కొనియాడారు. వాజ్‌పేయి దేశభక్తి, ఆదర్శాలు, ప్రజాసేవా స్ఫూర్తి ప్రతి భారతీయుడికీ ఎల్లప్పుడూ మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని కాంచి మహేందర్ అన్నారు.



## ట్యాంక్‌బండ్‌పై 300 అడుగుల జాతీయ జెండా ప్రదర్శన

### ఘనంగా లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320-B స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

హైదరాబాద్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320-బీ ఆధ్వర్యంలో హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఉదయం 9 గంటలకు ట్యాంక్‌బండ్ రోడ్డుపై 300 అడుగుల పొడవైన జాతీయ జెండాను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్స్ సీనియర్ నాయకులు, వివిధ క్లబ్‌ల అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొని జాతీయ జెండాకు గౌరవం తెలిపారు. దేశభక్తిని చాటుతూ నిర్వహించిన ఈ కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

కార్యక్రమానికి లయన్ గవర్నర్ శైలజా నాయర్, ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ అవంతి రెడ్డి, సెకండ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ చల్లా శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. అలాగే పలువురు లయన్స్ నాయకులు లయన్ దీపక్ భట్టాచార్జీ, లయన్ విద్యాసాగర్ రెడ్డి, లయన్ టి. రాజేంద్ర ప్రసాద్, లయన్ డా. మధుమిత భట్టాచార్జీ, లయన్ రాజ్‌నీష్ కుమార్ ఝా, లయన్ అలోక్ కుమార్ ఝా, లయన్ అనిల్ కుమార్ జైన్, లయన్ హర్బిందర్ సింగ్, లయన్ ఆకుల రవీందర్ రావు, లయన్ డా. బల్జీత్ కౌర్ తదితరులు పాల్గొన్నారు. జాతీయ జెండాను ప్రదర్శిస్తూ దేశభక్తి, జాతీయ ఐక్యత సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లిన లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320-బీ కార్యక్రమాన్ని పలువురు అభినందించారు.





# ప్రతిభకు పురస్కారం... పేద విద్యార్థులకు చేయూత

### వెలమ సంక్షేమ సంఘం నుంచి రూ.12.20 లక్షల స్కాలర్‌షిప్‌లు

### 215 మంది విద్యార్థులకు ఆర్థిక సహాయం.. 65 మందికి ప్రతిభా అవార్డులు

### విద్యార్థుల విజయమే సంఘానికి నిజమైన గౌరవం: డా. నడిపెల్లి వెంకటేశ్వర్ రావు

హనుమకొండ, ఆగస్టు 16: సమాజంలో ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించడంతో పాటు ఆర్థికంగా వెనుకబడిన వారికి చేయూతనందించాలనే లక్ష్యంతో ఉమ్మడి వరంగల్ జిల్లా వెలమ సంక్షేమ సంఘం నిర్వహించిన ప్రతిభా పురస్కారాలు--స్కాలర్‌షిప్‌ల ప్రదానోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. వీఎస్ఎస్ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది. వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షులు డా. నడిపెల్లి వెంకటేశ్వర్ రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్నమనేని జగన్ మోహన్ రావు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా 65 మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, 215 మంది విద్యార్థులకు రూ.12.20 లక్షల స్కాలర్‌షిప్‌లు అందజేశారు. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహిస్తూ, వారి ఉన్నత విద్యకు ఆర్థిక భరోసా కల్పిస్తున్న వెలమ సంక్షేమ సంఘం సేవలను పలువురు కొనియాడారు. ఎన్నమనేని జగన్ మోహన్ రావు మాట్లాడుతూ.. ప్రతిభను గుర్తించి ప్రోత్సహించే ఇలాంటి కార్యక్రమాలు యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని అన్నారు. సమాజంలోని ప్రతి వర్గం విద్యాభివృద్ధికి తోడ్పడితేనే దేశం మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.

డా. నడిపెల్లి వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ.. విద్యార్థుల విజయమే వెలమ సంక్షేమ సంఘానికి నిజమైన గుర్తింపు అని అన్నారు. చదువులో ప్రతిభ కనబరిచే ప్రతి విద్యార్థికి సంఘం అండగా నిలుస్తుందని, భవిష్యత్తులో స్కాలర్‌షిప్‌ల సంఖ్యను మరింత పెంచే దిశగా కృషి చేస్తామని తెలిపారు. విద్యతో పాటు విలువలు, క్రమశిక్షణ కూడా ప్రతి విద్యార్థి జీవితంలో ముఖ్యమని సూచించారు. స్కాలర్‌షిప్‌లు అందుకున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సంఘానికి కృతజ్ఞతలు తెలుపుతూ.. ఈ ఆర్థిక సహాయం తమ విద్యాభ్యాసానికి ఎంతో తోడ్పాటునిస్తుందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం కమిటీ సభ్యులు, ప్రముఖులు, 500 మందికి పైగా విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. అనంతరం అందరికీ భోజన వసతి ఏర్పాటు చేశారు.



## నూతన గ్రామ పంచాయతీ భవనానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ భూమి పూజ

వేములవాడ, ఆగస్టు 16 (వాయిస్ టుడే): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గ పరిధి లోని చందుర్తి మండలం ఆశిరెడ్డిపల్లి గ్రామం లో 20 లక్షలతో నిర్మిస్తున్న నూతన గ్రామ పంచాయతీ భవనానికి రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథి గా హాజరై భూమి పూజ నిర్వహించారు. ఇట్టి కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్మశాన వాటిక నిర్మించారు... రోడ్డు నిర్మాణం మర్చిపోయారు

### శిథిలావస్థకు చేరిన స్మశాన వాటిక పరికరాలు



రాజన్న సిరిసిల్ల జిల్లా, ఆగస్టు 16 (వాయిస్ టుడే): సిరిసిల్ల జిల్లా కేంద్రం లోని 26 వార్డు సంజీవయ్య నగర్ దళితుల కాలనీ సంబంధించిన స్మశాన వాటిక అభివృద్ధి ఆమడ దూరం లో ఉంది. కొత్త చెరువు కు సంబంధించిన మత్తడి కాలువ దాటి స్మశాన వాటిక కు వెళ్లాలి. కాలువ దాటి వెళ్లడానికి ఎలాంటి దారి లేదు. ప్రజా వాణి లో ఫిర్యాదు చేసిన, మున్సిపల్ కమిషనర్ కి ఎన్నిసార్లు వినతి పత్రాలు ఇచ్చిన, ఏలాంటి చర్యలు ఇప్పటివరకు తీసుకోలేదు. ఇప్పటికైనా దళితుల కాలనీ పై చిన్న చూపు చూడకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, మున్సిపల్ కమిషనర్, జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే కేటీఆర్, ప్రత్యేక చొరవ తీసుకొని స్మశాన వాటిక రోడ్డు నిర్మాణం చేయాలని దళిత సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## టిఆర్ఎస్ పార్టీ లోకి భారీగా చేరికలు

### సిరిసిల్ల నియోజకవర్గంలో తెలంగాణ రక్షణ సేనకు పెరుగుతున్న ఆదరణ



ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 16(వాయిస్ టుడే) సిరిసిల్ల నియోజకవర్గంలోని ముస్తాబాద్ మండలం కొండాపూర్ గ్రామం, ఎల్లారెడ్డిపేట మండలం లోని దుమాల గ్రామాలకు చెందిన 50 మందికి పైగా మహిళలు, యువకులు, ప్రజలు ఆదివారం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో తెలంగాణ రక్షణ సేన పార్టీలో చేరారు. వారికి సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి మజీద్ కండువాలు కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మజీద్ మాట్లాడుతూ.. తెలంగాణ రక్షణ సేన పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. ఉద్యమ కారులు, సింగరేణి కార్మికులు, ఆటో కార్మికులు, నిరుద్యోగుల పక్షాన, నేరెళ్ల బాధితులకు న్యాయం చేయాలనే డిమాండ్ తో అనేక ఉద్యమాలు నిర్వహించి సమస్యల పరిష్కారానికి కృషి చేశారని తెలిపారు. కవిత ప్రతిపాదిస్తున్న పాంచజన్య పథకాలు, ఉచిత విద్య, ఉచిత వైద్యం, రైతు సంక్షేమం, ఉపాధి అవకాశాలు, సామాజిక న్యాయం వంటి ప్రజా సంక్షేమ విధానాలకు ఆకర్షితులై ప్రజలు స్వచ్ఛందంగా పార్టీ లో చేరుతున్నారని పేర్కొన్నారు. 50 మందికి పైగా మహిళలు, యువకులు, ప్రజలు పార్టీలో చేరడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. 2029 లో తెలంగాణకు కల్వకుంట్ల కవిత ను ముఖ్యమంత్రి ని చేయడమే లక్ష్యంగా పనిచేయాలని మజీద్ పిలుపునిచ్చారు. కవిత ఆశయాలు, పాంచజన్య సూత్రాలను ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని, మహిళలు, యువత పెద్ద సంఖ్య లో రాజకీయాల్లోకి రావాలని కోరారు. సామాజిక న్యాయం, సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా తెలంగాణ రక్షణ సేన పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ సీనియర్ నాయకులు, ముస్తాబాద్ మండల నాయకులు మార్వాడి దేవరాజు, కదిరే రేణుక, మల్లవ్వ పాల్గొన్నారు.

# అలవాలపురం మున్నూరు కాపు సంఘం నూతన కమిటీ ఎన్నిక

### సంఘం బలోపేతానికి ఐక్యంగా పనిచేయాలి రామసాని శ్రీనివాస నాయుడు



అనంతగిరి మండలం, ఆగస్టు 16 (వాయిస్ టుడే): అనంతగిరి మండలం అలవాలపురం గ్రామ మున్నూరు కాపు సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సూర్యాపేట జిల్లా మున్నూరు కాపు సంఘం కన్వీనర్ రామసాని శ్రీనివాస నాయుడు సమక్షంలో, కోదాడ నియోజకవర్గ మున్నూరు కాపు కన్వీనర్ శెట్టి విజయభాస్కర్‌రావు ఆధ్వర్యంలో గ్రామ కమిటీని ఏర్పాటు చేశారు.

**నూతన కమిటీ**

అధ్యక్షుడు:లిలి పోతురాజు శ్రీనివాసరావు
ఉపాధ్యక్షుడు:లిలి కంబాల స్వామి
సెక్రటరీ:లిలి మద్దాల అప్పారావు
కోశాధికారి:లిలి శనగల రాధాకృష్ణ

**కార్యవర్గ సభ్యులు:** పసుపులేటి గోవిందరావు, అక్కినపల్లి లక్ష్మణుడు, శనగల రామయ్య, పగడాల కృష్ణయ్య, బద్రి శెట్టి వెంకటనారాయణ, పోతురాజు ఆదినారాయణ, కంబాల సైదులు, శెట్టి కృష్ణ, చాప కోటేశ్వరరావు, పోతురాజు గిరి తదితరులు.

**గౌరవ సలహాదారులు:** పోతురాజు సత్యనారాయణ, గొట్టేముక్కల వెంకటనారాయణ, బండారు వెంకటేశ్వర్లు, జగ్గయ్య, పోతురాజు హరికృష్ణ, కంబాల వీరబాబు తదితరులను గౌరవ సలహాదారులుగా నియమించారు.

ఈ సందర్భంగా కుల పెద్దలు పోతురాజు సాయినాథ్, కంబాల శంకర్, కంబాల చిరంజీవి, బండారు ఆనంద్, శరం శెట్టి శ్రీను, పసుపులేటి నరేష్, పోతురాజు రంగా, పోతురాజు రాంప్రసాద్, పోతురాజు నరసింహారావు, ఎల్లంశెట్టి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. కమిటీ ఎన్నికల ఇన్‌చార్జిలుగా కోదాడ పట్టణ అధ్యక్షుడు మురళి, చిలుకూరు గ్రామ శాఖ తరఫున సిరాపురపు శ్రీనివాసరావు, సిరాపురపు బిక్షం, కస్తూరి వెంకటేశ్వర్లు, ఎల్ఐసీ పూల వాసు తదితరులు పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ గ్రామంలో మున్నూరు కాపు సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు, సామాజిక ఐక్యతతో పాటు యువత, విద్యార్థులు, మహిళల అభివృద్ధికి కృషి చేయాలని నాయకులు ఆకాంక్షించారు.

# జర్నలిస్టుల హక్కులను కాలరాస్తే సహించేది లేదు

**ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యులు నగునూరి శేఖర్ ఘాటు హెచ్చరిక...**

**- అంబేద్కర్ చౌరస్తాలో భగ్గుమన్న అక్షర యోధులు..**

**- హోరెత్తిన రిలే నిరాహార దీక్షలు..**

**- స్వామిరెడ్డి పెట్టిన అక్రమ కేసును మంత్రులు వెంటనే ఉపసంహరింపజేయాలి..**

**- సమస్య తేలేవరకు అధికార కాంగ్రెస్ పార్టీ వార్తల సంపూర్ణ బహిష్కరణ...**

**- ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శి కాయిత రాములు కామని రవీందర్...**



హుజురాబాద్ ఆగస్టు 16 (వాయిస్ టుడే): జర్నలిస్టుల రెండు దశాబ్దాల సుదీర్ఘ పోరాటాలతో దక్కించుకున్న ఇళ్ల స్థలాల జోలికొస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని, అక్రమ కుట్రలను సహించే ప్రసక్తే లేదని ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు నగునూరి శేఖర్ తీవ్రస్థాయిలో హెచ్చరించారు. గూడూరు స్వామిరెడ్డి పెట్టిన వివాదాస్పద కేసుపై రాష్ట్ర మంత్రులు, ప్రభుత్వం తక్షణమే స్పందించి, ఆయనతో మాట్లాడి కేసును బేషరతుగా ఉపసంహరింపజేయాలని ఆయన అల్టిమేటం జారీ చేశారు. టీయు డబ్ల్యూజే (ఐజేయూ) హుజురాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ చౌరస్తా వేదికగా జర్నలిస్టులు చేపట్టిన నిరవధిక రిలే నిరాహార దీక్షలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ దీక్షా శిబిరానికి టీయూ డబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు గాండ్ల శ్రీనివాస్‌తో కలిసి ముఖ్య అతిథిగా హాజరైన నగునూరి శేఖర్ దీక్షాపరులకు సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. నిత్యం ప్రజా సమస్యలపై గళమెత్తే జర్నలిస్టులు తమ సొంతింటి కలను నెరవేర్చుకోవడానికి దాదాపు 20 ఏళ్లుగా అలుపెరగని ఉద్యమాలు చేశారని గుర్తుచేశారు. ఎన్నో ఆందోళనల ఫలితంగా ప్రభుత్వం నుంచి చట్టబద్ధంగా ఇళ్ల స్థలాలను సాధించుకుంటే, స్వార్థ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ నాయకుడు గూడూరు స్వామిరెడ్డి కక్షపూరితంగా అడ్డుపడుతూ న్యాయపరమైన చిక్కులు సృష్టించడం దుర్మార్గమని మండిపడ్డారు. శ్రమజీవులైన మీడియా ప్రతినిధులను మానసిక క్షోభకు గురిచేస్తున్న ఇలాంటి వ్యక్తి వైఖరిని ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాలని పిలుపునిచ్చారు. ప్రజాప్రతినిధులు, బాధ్యతాయుతమైన మంత్రులు తక్షణమే రంగంలోకి దిగి మధ్యవర్తిత్వం వహించి, ఈ అక్రమ కేసును ఎత్తివేయించేలా గట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జర్నలిస్టుల ఆగ్రహ జ్వాలలు రాష్ట్రవ్యాప్త ఉద్యమంగా మారుతాయని హెచ్చరించారు.

**అధికార కాంగ్రెస్ పార్టీ వైఖరిపై తీవ్ర నిరసన... వార్తల బహిష్కరణ...**

ఇళ్ల స్థలాల వివాదంపై అధికార కాంగ్రెస్ పార్టీ నాయకత్వం ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తోందని, సమస్యను పరిష్కరించడంలో పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని హుజురాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కాయిత రాములు, ప్రధాన కార్యదర్శి కామిని రవీందర్ లు ధ్వజమెత్తారు. జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్లపై కాంగ్రెస్ అధిష్ఠానం తన స్పష్టమైన వైఖరిని తేల్చి చెప్పే వరకు, ఇళ్ల స్థలాల సమస్య కొలిక్కి వచ్చేంతవరకు హుజురాబాద్ ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన అన్ని రకాల వార్తలు, ప్రెస్ మీట్లు, అధికారిక కార్యక్రమాలను సంపూర్ణంగా బహిష్కరిస్తున్నట్లు వారు తీవ్ర స్వరంతో ప్రకటించారు. ఈ నిరసన కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రతినిధులు, జర్నలిస్టులు కేదాసి శ్రీధర్, నిమ్మటూరి సాయికృష్ణ, సమ్మెట సతీష్, బొడ్డు శ్రీనివాస్, మచ్చిక చందు, టేకుల సాగర్, పోతరాజు సంపత్, బండి సాయికృష్ణ, నాగవెల్లి రాజు, బొడ్డు శ్రీనివాస్, భారత రజనీకాంత్ లు దీక్షలో కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్ర సంపత్ గౌడ్,మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ సామాజికవేత్త సబ్బానీ వెంకట్,బీసీ జేఏసీ నాయకులు చందుపట్ల జనార్ధన్,వెంకటేష్, దేవసాని ప్రియదర్శిని,జేఏసీ నాయకులు వేల్పుల రత్నం, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు మాడుగుల ఓదెలు, ముదిరాజ్ సంఘం నాయకులు కొలిపాక సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా “జర్నలిస్టుల ఐక్యత వర్ధిల్లాలి.. స్వామిరెడ్డి వైఖరి నశించాలి” అంటూ నినదిస్తూ అంబేద్కర్ చౌరస్తా పరిసరాలను హోరెత్తించారు. కళాకారుల ఆటపాట పలువురిని ఆకట్టుకున్నాయి.



## గంజాయి అక్రమ విక్రయానికి ప్రయత్నించిన ఇద్దరు వ్యక్తులు అరెస్ట్

**- 230 గ్రాముల గంజాయి మరియు రెండు సెల్ఫోన్లు స్వాధీనం**

జమ్మికుంట ఆగస్టు 16 (వాయిస్ టుడే): జమ్మికుంట పట్టణ సి ఐ రామకృష్ణ గౌడ్ ఆదివారం రోజున స్టేషన్ ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశం లో మాట్లాడుతూ..

1. నాగిరెడ్డి హరిప్రసాద్ S/o మల్లేష్, వయస్సు 26 సంవత్సరాలు, కులం: గౌడ్, వృత్తి: హైదరాబాద్, కేపీహెచ్ బీ కాలనీలోని OYO Rooms లో రిసెప్షనిస్టుగా పనిచేస్తున్నాడు. R/o H.No. 76-47, III జోన్, దొరల బంగ్లా, కల్యాణి ఖని, మందమర్రి పట్టణం, మంచిర్యాల జిల్లా.
2. దుర్గం కార్తిక్ S/o శశి. వయస్సు 19 సంవత్సరాలు, కులం: నేతకాని (రాజ), తీ/శీ: ఇంటి నం. 2-16/1, వెంకటాపూర్ గ్రామం, మందమర్రి మండలం, మంచిర్యాల జిల్లా. ప్రస్తుతం: ఆదిబట్ల, ఎల్బీ నగర్, హైదరాబాద్.

ఇద్దరూ గంజాయి సేవించే అలవాటుకు గురై, సులభంగా ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో, 15.08.2026 తేదీన గంజాయి కొనుగోలు చేయడానికి మహారాష్ట్రలోని నాగపూర్ ప్రాంతానికి వెళ్లి, అక్కడ ఒక గుర్తు తెలియని వ్యక్తి వద్ద నుండి 230 గ్రాముల గంజాయిని రూ.11,400/- కు కొనుగోలు చేసి, రైలులో మందమర్రికి తీసుకువచ్చి దాచిపెట్టినట్లుఅనంతరం, 16.08.2026 తేదీన గంజాయిని తీసుకొని జమ్మికుంటకు వచ్చి. ఎఫ్ సి ఐ గోడౌన్ పరిసర ప్రాంతంలో గంజాయిని విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో పోలీసులు వారిని గుర్తించారు. పోలీసులను చూసిన నిందితులు అక్కడి నుండి పారిపోవడానికి ప్రయత్నించగా, పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. స్వాధీనం చేసుకున్న మాదకద్రవ్యాలు మరియు ఇతర వస్తువులు

1. 230 గ్రాముల గంజాయి, సుమారు రూ.11,400/- విలువైనది
2. రెండు సెల్ఫోన్లు

**జమ్మికుంట పోలీసుల విజ్ఞప్తి**

యువత గంజాయి వంటి మాదకద్రవ్యాలకు బానిసై తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని జమ్మికుంట పోలీసులు సూచించారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయం లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం ప్రజలకు తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా మరియు విక్రయంపై జమ్మికుంట పోలీసులుకఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## దుగ్యాల సేవలు చిరస్మరణీయం



తొర్రూరు, ఆగస్ట్ 16 వాయిస్ టుడే : మాజీ ఎమ్మెల్యే దుగ్యాల శ్రీనివాసరావు పాలకుర్తి (పాత చెన్నూరు) నియోజకవర్గానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు రామసహాయం కృష్ణ కిషోర్ రెడ్డి అన్నారు.దుగ్యాల శ్రీనివాసరావు 62వ జయంతి సందర్భంగా దుగ్యాల శ్రీనివాసరావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పాలకుర్తి నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు, కీర్తిశేషులు దుగ్యాల శ్రీనివాసరావు 62వ జయంతిని పురస్కరించుకొని ఆదివారం విశ్రాంతి భవన్‌లో మహా అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు వెల్తూరి మల్లేశం, మిట్టకోల లక్ష్మణ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుగ్యాల ప్రజలకు విశేష సేవలందించడంతో పాటు ప్రతి వ్యక్తిని గుర్తుపట్టి ఆప్యాయంగా పలకరించే వారని అన్నారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ, కార్యకర్తల కుటుంబాలతో కూడా ఆత్మీయ బంధాన్ని కొనసాగించిన మహోన్నత నాయకుడని కొనియాడారు. ఆయన జీవితం సేవా స్ఫూర్తి నేటి తరానికి మార్గదర్శకమని పేర్కొన్నారు.దుగ్యాల శ్రీనివాసరావు పాత చెన్నూరు నియోజకవర్గంలో కేవలం 15 రోజుల్లోనే ప్రజల మన్ననలు పొంది ఎమ్మెల్యేగా విజయం సాధించారని తెలిపారు. 2006 నుంచి 2009 వరకు నెల్లికుదురు, నర్సింహులపేట, తొర్రూరు, పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల మండలాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారని గుర్తుచేశారు. రైతులకు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా నాణ్యమైన విద్యుత్ అందించేందుకు సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు కృషి చేశారని తెలిపారు. “విద్యతోనే దేశ భవిష్యత్తు నిర్మించబడుతుంది” అనే ఆలోచనతో నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో పాఠశాల ఉండాలని విద్యార్థులు చెట్ల కింద చదువుకునే పరిస్థితి ఉండకూడదనే లక్ష్యంతో అదనపు తరగతి గదులను మంజూరు చేయించి విద్యాభివృద్ధికి విశేష కృషి చేశారని అన్నారు.తొర్రూరు పట్టణంలో ఉన్నత విద్య అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కూడా ఆయన కృషి చేశారని గుర్తుచేశారు. పాలకుర్తి శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి వచ్చే భక్తులు ఇబ్బందులు పడకుండా గుట్టపైకి సీసీ రోడ్డు నిర్మాణానికి కృషి చేశారని తెలిపారు. అంగన్వాడీ భవనాల నిర్మాణం, అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని పేర్కొన్నారు. నెల్లికుదురు--బొడ్లాడ--బ్రాహ్మణ కొత్తపల్లి మధ్య ఆకేరు వాగుపై వంతెన నిర్మాణానికి కృషి చేసి, ఆయా ప్రాంతాల ప్రజలకు రవాణా సౌకర్యాన్ని మెరుగుపరిచారని తెలిపారు.దుగ్యాల శ్రీనివాసరావు ఆశయాలను కొనసాగించి ఆయన జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న దుగ్యాల శ్రీనివాసరావు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు వెల్తూరి మల్లేశం, మిట్టకోల లక్ష్మణ్ లను అభినందించారు.ఈ కార్యక్రమంలో ఎం.డి.అమీర్, సోమ హరిప్రసాద్,కృష్ణ,రవి, మంద యాకమల్లు, అశోక్ రెడ్డి, వినోద్ రెడ్డి, అంజన్న, దుగ్యాలఅభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తలసేమియా చిన్నారుల కోసం నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతం

**రక్తదాతలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపిన రుదిరం సేవ ట్రస్ట్ పౌండర్ సామినేని రాకేష్**

ముదిగొండ మండలం ఆగస్ట్ 16 వాయిస్ టుడే : తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల ప్రాణాలను కాపాడేందుకు మా రుధిరం ఛారిటీ ట్రస్ట్ మరియు సంకల్ప ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో చిరుమర్రిలో నిర్వహించిన రక్తదాన శిబిరం విశేష స్పందనతో అత్యంత విజయవంతంగా ముగిసింది.ఈ శిబిరంలో అనేకమంది యువతీ యువకులు, స్థానికులు, సేవా దృక్పథం కలిగిన పౌరులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. చిన్నారుల పట్ల మానవతా దృక్పథాన్ని చాటుతూ ముందుకు వచ్చిన రక్తదాతలందరికీ రాకేష్ మరియు నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ




“తలసేమియా చిన్నారుల ప్రాణాలు నిలవాలంటే నిరంతరం రక్తం అవసరం. రక్తదాతలు ఇచ్చిన ప్రతి రక్తపు బొట్టు ఆ చిన్నారులకు పునర్జన్మను ఇస్తుంది. ఇంతటి మహత్తరమైన కార్యక్రమంలో భాగస్వాములై, ప్రాణదాతలుగా నిలిచిన ప్రతి ఒక్క రక్తదాతకు, శిబిర నిర్వహణకు సహకరించిన వైద్య బృందానికి, వాలంటీర్లకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.”భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను మరిన్ని నిర్వహించి అవసరంలో ఉన్నవారికి అండగా నిలుస్తామని సామినేని రాకేష్ పేర్కొన్నారు. అనంతరం న్యూ లక్ష్మీపురం యువత ఇంత గొప్ప మహోత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన రాకేష్ ను శాలువాతో సత్కరించి అభినందించారు.



## విద్యార్థులకు చేయూత.. ప్లేట్లు, పెన్నుల పంపిణీ

**గౌరారం పాఠశాలలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు**

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఇన్చార్జి (వాయిస్ టుడే న్యూస్ ప్రతినిధి) : కామారెడ్డి జిల్లా పిట్లం మండలం గౌరారం గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ప్లేట్లు, పెన్నులు పంపిణీ చేశారు. పిట్లం రిటైర్డ్ ఉపాధ్యాయులు దయానంద్ విద్యార్థులకు ప్లేట్లు వితరణ చేయగా, వార్డు సభ్యులు మారుతి పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లోకినేని హనుమంత్ రావు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జే. శంకర్, ఉప సర్పంచ్ దొడ్ల హన్మండ్లు ప్రధానోపాధ్యాయులు శంకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన కమిటీ

**రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు అక్కనపల్లి భాస్కర్**

రాజన్న సిరిసిల్ల జిల్లా, ఆగస్టు 16 (వాయిస్ టుడే): భవన నిర్మాణ కార్మిక సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు అక్కెనపల్లి భాస్కర్ నూతన కమిటీ ఏర్పాటు చేశారు.కార్యక్రమం లో భవన నిర్మాణ కార్మికులు, అధిక సంఖ్య లో పాల్గొన్నారు.నూతన పట్టణ భవన నిర్మాణ కార్మిక సంఘాన్ని ఏర్పాటు చేశారు.నూతనంగా ఎన్నుకోబడ్డ భవన నిర్మాణ కార్మిక సంఘం రాజన్న సిరిసిల్ల టౌన్ అధ్యక్షులు గా సోమిశెట్టి నవీన్, ఉపాధ్యక్షులుగా షేక్ ముస్తఫా, గోట్ల వికాస్, ప్రధాన కార్యదర్శిగా అక్కెనపల్లి మల్లేశం, కోశాధికారులు తాళ్ల గణేష్ ,ఎండి బషీర్, కాదశివ సలహాదారులు గా పోతురాజుల రవి, ఎండి అనిష్ భోగసాయి, షేక్ బాబు, ఎదునూరి ప్రశాంత్, ఎదుల్లా భద్ర జహీర్, చిలుక నరసింహ, మల్యాల రాజయ్య, మాచరెడ్డి శివారెడ్డి, ఎండి ఇలియాస్ ఖాయిూతి ,హనుమవ్వ, ఎస్ కే కాసింబి, సింగారం శ్రీనివాస్, బచ్చుపల్లి కుమార్, ఎం.డి ముఖి పద్మ లక్ష్మి, రాజవ్వ, సుందర్ చందు, నరసయ్య రాజు, శంకరులు, భవన నిర్మాణ కార్మిక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## నాగుల పంచమి పర్వదినం ప్రతి ఇంటా సిరిసంపదలు నింపాలి

**గౌరారం ప్రజలకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జూపాల శంకర్ కొట్టు శుభాకాంక్షలు**



ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఇన్చార్జి (వాయిస్ టుడే న్యూస్ ప్రతినిధి) : గౌరారం: పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలోని గౌరారం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జూపాల శంకర్ కొట్టు గ్రామ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ‘ఇది కదా నిజం’ న్యూస్ ప్రతినిధితో మాట్లాడుతూ, పంచమి పర్వదినం ప్రతి కుటుంబంలో ఆనందం, శాంతి, సౌభాగ్యం, సిరిసంపదలు నింపాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజలంతా ఐకమత్యంతో, భక్తిశ్రద్ధలతో పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కోరారు. ప్రజలందరికీ పంచమి శుభాకాంక్షలు తెలిపారు.

## పిట్లం పట్టణ వైశ్య సంఘ అధ్యక్షునిగా బొడ్ల రాజు ఏకగ్రీవ ఎన్నిక



ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఇన్చార్జి (వాయిస్ టుడే ప్రతినిధి) : పిట్లం పట్టణ వైశ్య సంఘ అధ్యక్షునిగా బొడ్ల రాజును సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం వైశ్య సంఘ భవనంలో మండల అధ్యక్షుడు మంచి విజయ్ గుప్తా, ఎలక్షన్ ఆఫీసర్ కోటరాజులు, బాల ప్రసాద్ సార్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులందరి సమ్మతితో బొడ్ల రాజును పట్టణ వైశ్య సంఘ నూతన అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.బొడ్ల రాజు ఎన్నికతో సంఘ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. పట్టణ వైశ్య సంఘ అభివృద్ధికి, సభ్యుల సంక్షేమానికి నూతన అధ్యక్షుడు బొడ్ల రాజు కృషి చేయాలని ఆకాంక్షించారు. సంఘం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతో పాటు సభ్యులందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు మంచి విజయ్ గుప్తా నూతన పట్టణ అధ్యక్షుడు బొడ్ల రాజును ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. సంఘ ఐక్యతను కాపాడుతూ, వైశ్య సంఘ అభివృద్ధికి నూతన అధ్యక్షుడు కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైశ్య సంఘ సభ్యులు, నాయకులు పాల్గొని నూతన అధ్యక్షుడికి అభినందనలు తెలిపారు.



## శ్రీకాళహస్తిలో హెల్పింగ్ హాండ్

శ్రీకాళహస్తి (వాయిస్ టుడే) ఆగస్టు 16: శ్రీకాళహస్తిలోని నగిరివీధి నందు ఉన్న హెల్పింగ్ హాండ్ సంస్థ 176వ నెల సేవా కార్యక్రమాలను నేడు నిర్వహించింది, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హెల్పింగ్ హాండ్స్ అధినేత మునీర్ భాష, ముఖ్య అధితిగా పాల్గొని ప్రత్యేక ప్రతిభావంతులకు నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు, ఈ సందర్భంగా మునీర్ భాష, మాట్లాడుతూ.. హెల్పింగ్ హాండ్స చేస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు, , హెల్పింగ్ హాండ్స్ సంస్థ అధినేత మునీర్ భాష చేస్తున్న సేవా కార్యక్రమాలను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకొని ప్రజలకు వారి వంతు సహాయం చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు, ఈ సేవా కార్యక్రమాలకు తను నువ్వు నీ ఆహ్వానించి ప్రత్యేక ప్రతిభావంతులకు నిత్యసరసరుకులు ఆనందం ఉందంటూ ఆనందంగా ఉందంటూ ఆనందం వ్యక్తం చేశారు.. ఈ కార్యక్రమం నందు హెల్పింగ్ హ్యాండ్సం సభ్యులు గరికపాటి రమేష్, , హబీబ్ ,తదితరులు పాల్గొన్నారు.



## పాల్వంచ రాజేష్ జన్మదినం సందర్భంగా రక్తదానం

### తలసేమియా చిన్నారుల ప్రాణాలను కాపాడేందుకు న్యూ లక్ష్మీపురం యువత ముందడుగు

ముదిగొండ మండలం ఆగస్ట్ 16 వాయిస్ టుడే : తెలంగాణ రాష్ట్ర నాయకులు, పార్లమెంట్ సభ్యులు (ఎంపీ) వద్దిరాజు రవిచంద్ర మరియు మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావుల ముఖ్య అనుచరుడు పాల్వంచ రాజేష్ జన్మదినాన్ని పురస్కరించుకుని చిరుమర్రి గ్రామంలో 'మా రుధిరం చారిటీ' ఆధ్వర్యంలో, 'సంకల్ప ఆర్గనైజేషన్' సామినేని రాకేష్,బిచ్చాల కవిత, సహకారంతో ఏర్పాటు చేసిన ఈ స్వచ్ఛంద రక్తదాన శిబిరానికి గ్రామీణ యువత నుంచి విశేష స్పందన లభించింది.

### చిన్నారుల ప్రాణదాతలుగా గ్రామీణ యువత

"ఒక చుక్క రక్తం.. ఒక చిన్నారి చిరునవ్వుకు ప్రాణాధారం" అనే ఆదర్శ నినాదంతో, తలసేమియా (Thalassemia) వ్యాధితో బాధపడుతున్న చిన్న పిల్లల ప్రాణాలను కాపాడటమే లక్ష్యంగా న్యూ లక్ష్మీపురం గ్రామ యువకులు పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన యువకులు మాట్లాడుతూ.. కరోనా కష్టకాలం నుంచి నేటి వరకు గ్రామ ప్రజలు ఎలాంటి ఆపదలో ఉన్నా నిరంతరం అండగా నిలిచే పాల్వంచ రాజేష్ సేవాస్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని ఈ రక్తదాన కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. తలసేమియా బాధితులకు క్రమం తప్పకుండా రక్తం ఎక్కించడం అత్యంత ఆవశ్యకమని, యువత చేసిన ఈ రక్తదానం ఎంతోమంది చిన్నారుల ప్రాణాలను నిలబెట్టడంతో పాటు వారి కుటుంబాల్లో కొత్త ఆశలు నింపుతుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మా రుధిరం చారిటీ, సంకల్ప ఆర్గనైజేషన్ ప్రతినిధులు, స్థానిక ప్రముఖులు, గ్రామ పెద్దలు మరియు రక్తదానం చేసిన యువకులు పాల్గొన్నారు.



## సీనియర్ పార్టీ సానుభూతిపరాలు గాలి ఎల్లమ్మ గౌడ్ మృతి

### పాడె మోసిన రాష్ట్ర నాయకులు బండి రమేష్ సర్పంచ్ సామినేని రాంబాబు



ముదిగొండ మండలం ఆగస్ట్ 16 వాయిస్ టుడే : చిరుమర్రి గ్రామానికి చెందిన సిపిఎం పార్టీ సానుభూతిపరులు గాలి ఎల్లమ్మ 75 అనారోగ్యంతో ఆదివారం ఉదయం మరణించారు ఆమె కు ముగ్గురు కుమారులు ఒక కుమార్తె ఉన్నారు ఆమె పార్థివ దేహం పై సిపిఎం జెండాని రాష్ట్ర కమిటీ సభ్యులు బండి రమేష్, బుగ్గ వీడి సరళ, కప్పి నివాళు లర్పించారు వారి కుటుంబం పార్టీ పట్ల విధేయతతో నిజాయితీగా ఉండేవారని వారి కుమారులు కూడా పార్టీ సభ్యులుగా కొనసాగుతున్నారని ఎన్ని కష్టాలు వచ్చినా పార్టీ పార్టీని నమ్ముకొని ఉండాలని ఆమె తన కుమారులకి ఎప్పుడూ చెప్తుండేది అలాంటి ఎల్లమ్మ మరణం పార్టీకి తీరని లోటని అలాగే ఆమె ఆశయాలు వారి కుమారులు కూతురు నెరవేరుస్తుందని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి బండి పద్మ సిపిఎం మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం సిపిఎం నాయకులు కోలేటి ఉపేందర్ రావు అరుణ సర్పంచ్ స్వామి రాంబాబు బండి శేఖర్ సామినేని రామయ్య శవగాని మాధవ రావు బండి మోహన్ రావు గండు ఉపేందర్ పాల్గొన్నారు.

# మెగా కార్డన్ సెర్చ్ నిర్వహణ సమాచారం



శ్రీకాళహస్తి(వాయిస్ టుడే)ఆగస్ట్ 16 : శ్రీకాళహస్తి సబ్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ,నేరాల నియంత్రణ, మాదకద్రవ్యాల నిర్మూలన మరియు ప్రజలకు సురక్షిత వాతావరణం కల్పించేందుకు తేదీ 16-08-2026న ఉదయం 04:30 గంటల నుండి,ఎస్పీ ఆదేశాల మేరకు, శ్రీకాళహస్తి డి.ఎస్.పి కె. నరసింహ మూర్తి, శ్రీకాళహస్తి టౌన్ సి ఐ, సి.వెంకటేష్ వారి ఆధ్వర్యంలో, జిల్లా సిబ్బంది, 26 మంది సిఐ/ఎస్ఐలు, 140 కానిస్టేబుళ్ల తోకలిసి శ్రీకాళహస్తి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొండమిట్ట,ఎన్టీఆర్ నగర్ నందు మెగా కార్డన్ సెర్చ్ నిర్వహించడమైనది.

సదరు కార్డన్ సెర్చ్‌లో బాగంగా రికార్డ్స్ సరిగా లేని 170 ద్వి చక్ర వాహానాలు 10 ఆటోలను సీజ్ చేయడమైనది.

### ఇప్పటి వరకు చేపట్టిన ముఖ్యమైన చర్యలు:

శ్రీకాళహస్తి సబ్ డివిజన్ పరిధిలో పలుమార్లు ఏరియా డామినేషన్ కార్యక్రమాలు నిర్వహించి, నేరస్థులు మరియు అసాంఘిక శక్తులపై నిరంతర నిఘా ఏర్పాటు చేయబడింది. మొత్తం ఈ సంవత్సరం లో 15 కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహించి, సరైన పత్రాలు లేని సుమారు 600 వాహనాలను స్వాధీనం చేసుకొని, చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరిగింది.రాత్రి వేళల్లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న 49 మంది అనుమానితులను అదుపులోకి తీసుకొని, వారి పై బైండ్ ఓవర్ కేసులు నమోదు చేయబడినవి.ప్రజా శాంతి భద్రతలకు భంగం కలిగించే అవకాశం ఉన్న 55 మందిని గుర్తించి, వారి పై బైండ్ ఓవర్ చర్యలు చేపట్టడం జరిగింది. గంజాయి సేవిస్తున్నారనే అనుమానంతో 1000 మంది యువతకు గంజా టెస్ట్ కిట్ల ద్వారా పరీక్షలు నిర్వహించగా, 50 మందికి పాజిటివ్ రావడంతో వారి పై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరిగింది. మాదకద్రవ్యాల నియంత్రణలో భాగంగా 16 ఎన్ డి పి ఎస్ చట్టం కేసులు నమోదు చేసి, 88 మంది నిందితులను అరెస్ట్ చేయడం జరిగింది. వారి వద్ద నుండి మొత్తం 124 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకోవడమైనది.నేరాల నియంత్రణలో భాగంగా,ఎన్ డి పి ఎస్ చట్టం కేసులలో 4 మంది నిందితులపై మరియు ప్రాపర్టీ ఆఫెన్సెస్‌కు సంబంధించిన 3 మంది నిందితులపై మొత్తం 7 మందికి పీడీ నివారక నిర్బంధం చట్టం అమలు చేసి, వారిని కడప సెంట్రల్ ప్రిజన్‌కు పంపించడం జరిగింది. మహిళలపై నేరాలను నివారించేందుకు తీసుకుంటున్న చర్యలు మహిళల భద్రతకు తక్షణ స్పందన మరియు రక్షణ కల్పించేందుకు సబ్ డివిజన్ పరిధిలోని 04 మంది భౌజలు మరియు 01 హెచ్ సి తో శక్తి టీమ్ ఏర్పాటు చేయబడింది. 10. మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ ఈవ్ టీజింగ్, స్టాకింగ్, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై పాఠశాలలు, కళాశాలలు మరియు ప్రజల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించ బడుతున్నాయి.ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా డ్రంక్ అండ్ డ్రైవ్, అతివేగం, హెల్మెట్, సీటుబెల్ట్ ఉల్లంఘనలపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతోంది.కమ్యూనిటీ పోలీసింగ్, బీట్ పోలీసింగ్, సీసీ కెమెరాల వినియోగాన్ని విస్తృతం చేస్తూ, ప్రజల సహకారంతో నేరాల నివారణకు సమర్థవంతమైన చర్యలు కొనసాగుతున్నాయి.నేర నియంత్రణలో భాగంగా రాత్రి వేళల్లో పట్టణ పరిధిలో నిరంతర పెట్రోలింగ్ మరియు లర్కింగ్ బీట్స్ నిర్వహించబడుతున్నాయి. ప్రతి రోజు రాత్రి 10.00 గంటలకు వైన్ షాపులు, హోటళ్లు తదితర వ్యాపార సంస్థలు నిర్ణీత సమయానికి మూసివేయబడేలా చర్యలు తీసుకుంటూ, అలాగే రాత్రి 12.00 గంటలకు బార్ అండ్ రెస్టారెంట్లు మూసివేయబడేలా పర్యవేక్షణ నిర్వహించబడుతోంది. అదేవిధంగా, మఫ్టీలో ప్రత్యేక లర్కింగ్ బీట్ సిబ్బందిని మోహరించి అనుమానాస్పద వ్యక్తులు, అసాంఘిక కార్యకలాపాలపై నిరంతర నిఘా కొనసాగించబడుతోంది మహిళలు మరియు బాలికలపై జరిగే నేరాల నివారణలో భాగంగా సబ్ డివిజన్ పరిధిలో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించ బడుతున్నాయి. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలలు



మరియు బాలికల హాస్టళ్లలో విద్యార్థినులకు మహిళల భద్రత, చట్టపరమైన రక్షణ, సైబర్ నేరాల నివారణ, ఈవ్ టీజింగ్, స్టాకింగ్ వంటి అంశాలపై వారంలో రెండు సార్లు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, అత్యవసర పరిస్థితుల్లో డయల్-112 సేవలను వినియోగించుకునే విధంగా అవగాహన కల్పించబడుతోంది.

**ప్రజలకు విజ్ఞప్తి:** గంజాయి, ఇతర మాదకద్రవ్యాల విక్రయం, అక్రమ మట్కా, లాటరీ, జూదం, సంఘ వ్యతిరేక కార్యకలాపాలు లేదా శాంతిభద్రతలకు భంగం కలిగించే వ్యక్తుల గురించి సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీసు స్టేషన్‌కు లేదా డయల్-112 ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని కోరుతున్నాము. సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయి. ప్రజల సహకారంతో శ్రీకాళహస్తి సబ్ డివిజన్‌ను నేరరహిత, మాదకద్రవ్య రహిత మరియు శాంతియుత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు పోలీసు శాఖ భవిష్యత్తులో కూడా మరింత కఠిన చర్యలను కొనసాగిస్తుంది.

## నాగేశ్ షెట్కార్‌కుమహమ్మద్ తన్వీర్ జన్మదిన శుభాకాంక్షలు



ఝరాసంగం ఆగస్టు16 (వాయిస్ టుడే) : జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ షెట్కార్ సోదరుడు నాగేశ్ షెట్కార్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ఇండస్ట్రియల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మహమ్మద్ తన్వీర్ ఆదివారం నారాయణఖేడ్ పట్టణంలోని నాగేశ్ షెట్కార్ నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా నాగేశ్ షెట్కార్‌ను ఆత్మీయంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మహమ్మద్ తన్వీర్ మాట్లాడుతూ నాగేశ్ షెట్కార్ ఎల్లప్పుడూ ఆయురారోగ్యాలతో, ఆనందంగా, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ప్రజలతో ఆయనకు ఉన్న ఆత్మీయ అనుబంధం మరింత బలపడాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కుతుబుద్దిన్ తాజోద్దీన్, కోహిర్ మున్సిపల్ వైస్ చైర్మన్ హనాన జావిద్, కాంగ్రెస్ పార్టీ కోహిర్ పట్టణ అధ్యక్షుడు ముజఫర్, కోహిర్ వైస్ ఎంపీపీ షాకీర్ యూసుఫ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## అటల్ జీ సేవలు చిరస్మరణీయం

### వాజ్ పేయ్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళి అర్పించిన ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి



నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) ఆగస్టు 16: భారతరత్న, మాజీ ప్రధానమంత్రి, భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు దివంగత శ్రీ అటల్ బిహారీ వాజ్ పేయి గారి 8వ వర్ధంతి సందర్భంగా నేడు బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఘన నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అటల్ జీ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించి, ఆయన దేశానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. అటల్ జీ ఒక రాజనీతిజ్ఞుడు మాత్రమే కాదు, ఒక కవి, ఒక దార్శనికుడు. పోఖ్రాన్ అణు పరీక్ష, సర్వ శిక్షా అభియాన్ వంటి ఎన్నో చారిత్రాత్మక నిర్ణయాలతో భారతదేశాన్ని ప్రగతి పథంలో నడిపించిన మహనీయుడని కొనియాడారు. ఆయన చూపిన సుపరిపాలన మార్గం ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు రావుల రాంనాథ్, తక్కల రమణ రెడ్డి, ముత్యం రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు సత్యం చంద్రకాంత్, పట్టణ బీజేపీ నాయకులు కందుల హరీష్, పొడెల్లి గణేష్, డి శ్రీనివాస్, తో పాటు బీజేపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సాంకేతిక హంగులతో "సరస్వతి శిశు మందిర్" కు సరికొత్త శోభ



భద్రాచలం, ఆగస్టు 16 : ఆదివాసీ చిన్నారుల్లో ప్రతిభను వెలికితీస్తూ వారిని అన్ని రంగాల్లో ఉన్నతులు గా తీర్చిదిద్దే లక్ష్యం తో సరస్వతి శిశు మందిర ముందుకు సాగుతున్నది. విద్యకు సాంకేతిక హంగుల్ని జోడించి భవిష్యత్ తరాలను మేటి పౌరులు గా రూపొందించే కృషి శిశు మందిరం లో కొనసాగుతున్నది. విద్య, సాంకేతిక నైపుణ్యం, నైతిక క్రమశిక్షణ లక్ష్యం గా శిశు మందిరం ను నడుపుతున్నారు. భద్రాచలం లోని సరస్వతి శిశు మందిరం పేద ఆదివాసీ విద్యార్థులకు బోధనా వసతి కల్పిస్తోంది. ప్రముఖ ఐటీసీ కాంట్రాక్టర్, సామాజిక సేవాతాత్పరులు పాకాల దుర్గా ప్రసాద్ పర్యవేక్షణ లో శిశు మందిరం అభివృద్ధి పథం లో నడుస్తున్నది. పలువురు దాతలను సంప్రదించి అనేక వసతులను, సాంకేతిక సొగసు లను ఏర్పాటు చేసేందుకు దుర్గా ప్రసాద్ నిత్యం చేస్తున్న కృషి ప్రశంసనీయం. కార్పొరేట్ పాఠశాలల వసతుల్ని సరిపోల్చే లా గిరిజన విద్యార్థులకు ఉన్నత మైన ఉచిత విద్యను అందించడమే తమ లక్ష్యం అని దుర్గా ప్రసాద్ పేర్కొన్నారు.

శిశు మందిరం అధ్యక్షులు గా ఉన్న దుర్గా ప్రసాద్ ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో పాఠశాల ప్రగతి నీ వివరించారు. విద్యతో పాటు సంస్కృతి, సంప్రదాయాలు, నైతిక క్రమశిక్షణ నేర్పుతున్నట్టు ఆయన తెలిపారు. ప్రస్తుతం 150 మంది విద్యార్థులు ఉన్న శిశు మందిరం ను మరింత అభివృద్ధి చేసేందుకు ప్రవాస భారతీయులతో పాటు , పలువురు దాతలు ముందుకు వచ్చినట్లు ఆయన తెలిపారు. డిజిటల్ తరగతి గదులు, కంప్యూటర్ లాబ్స్ లాంటి అన్ని రకాల ఆధునిక సాంకేతిక వసతులను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పాఠశాల ఆవరణలోనే గోశాల ను ఏర్పాటు చేసి విద్యార్థులకు స్వచ్ఛమైన ఆవు పాలు, పెరుగు అందిస్తున్నామని ఆయన చెప్పారు. ఇటువంటి సౌకర్యం ఉన్న ఏకైక పాఠశాల భద్రాచలంలోని సరస్వతి శిశు మందిర మాత్రమేనని ఆయన అన్నారు. ప్రవాస భారతీయులు దయాకర్, శ్రీకాంత్ తో పాటు ఐటీసీ సహకారంతో విద్యార్థులకు సాంకేతిక విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. 60 లక్షల రూపాయలతో డిజిటల్ తరగతి గదులు, కోటి రూపాయలతో కంప్యూటర్ ల్యాబు లు, గోశాల నిర్మాణం చేసినట్లు తెలిపారు. సరస్వతి శిశు మందిర్ లో 6 వ తరగతి నుండి 10 వ తరగతి వరకూ 150 మంది విద్యార్థిని, విద్యార్థులకు శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో ఉచిత విద్య, వసతి అందిస్తున్నట్లు తెలిపారు. 500 మంది విద్యార్థులకు సరిపడా వసతి సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇదే పాఠశాలలో చదువుకున్న వారు ఇప్పుడు ఉన్నత స్థానంలో ఉన్నారని, విద్యాబుద్ధులు నేర్పడంతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం, సాంస్కృతిక నృత్యం, సైన్స్ లో ప్రావీణ్యత పెంపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శిశు మందిర్ ప్రధాన కార్యదర్శి గట్టు వెంకటాచారి, ప్రధానో పాధ్యాయురాలు గీత పాల్గొన్నారు.